క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: నెలివాడ గ్రామంలోని ధర్మకోనేరులో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఎస్.హరిహరరావు శుక్రవారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్ల సీట్లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా మామిడి, జీడి మొక్కల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏపీఓ బి.కృష్ణవేణి, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

వేపాడ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నిశ్చల శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

చేపల చెరువుల తవ్వకాలు చేపట్టండి



ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలు చేస్తున్న ఏపీడీ శ్రీనివాసరావు

మెరకముడిదాం: ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపల చెరువుల కోసం దరఖాస్తున్న వారితో చెరువులు తవ్వించేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ మీసాల శ్రీనివాసరావు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయాలని చెప్పారు. ఫారం పాండ్లు, ఉద్యానవన తోటల్లో గట్లు ఎత్తే పనులు మొక్కల చుట్టూ ట్రెంచ్‌లు తవ్వే పనులు చేయించాలన్నారు. జాబ్ కార్డులు ఉన్నవారినే పనులకు అనుమతించాలన్నారు. ఇన్‌చార్జి ఏపీఓ నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



శింగరాయి గ్రామంలోని కాలువల్లో జేసీబీతో చేపడుతున్న పూడిక తొలగింపు పనులు

వేపాడ: మండలంలోని శింగరాయి, బొద్దాం, అరిగిపాలెం తదితర గ్రామాల్లో సర్పంచ్‌లు శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేయించారు. వీధి కాలువల్లో పూడికతో పాటు రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు.తాగు నీటి ట్యాంకులను శుభ్రం చేయించారు. సీజనల్ వ్యాధుల బారినపడకుండా ప్రజలంతా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని పంచాయతీ కార్యదర్శులు సూచించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



అవగాహన కల్పిస్తున్న రమాదేవి

గంట్యాడ: బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని దిశ వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ కె.రమాదేవి సూచించారు. నరవ గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు చిన్న వయస్సులో పెళ్లి చేయడం వల్ల ప్రసవ సమయంలో ఇబ్బందులు పడతారని, తరచూ అనారోగ్యానికి గురవుతారని చెప్పారు. బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా చైల్డ్‌లైన్ ట్రోల్ ఫ్రీ నంబర్ 1098కు కాని, పోలీసులకు కాని సమాచారం అందించాలని సూచించారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న మహిళలు రక్షణ కోసం 181 ట్రోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. దిశవన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ టి.అనిత, పాఠశాల ప్రిన్సిపాల్ పి.వి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత



గజపతినగరం రూరల్: తుమ్మికాపల్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



దత్తిరాజేరు: ఎస్టీ కొత్తవలసలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ స్రవంతి



బొండపల్లి: తమటాడలో ర్యాలీని నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బొండపల్లి: వర్షాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు పాటించాలని బొండపల్లి పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.ఏ. భాషా సూచించా రు. మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకుని తమటాడ గ్రామంలో వైద్యసిబ్బందితో కలిసి శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వ హించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురు స్తున్నందున మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు విజృంభించే అవ కాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నివాస పరిసరాల్లో తాగిపడేసిన కొబ్బరి బొండాల చిప్పలు, పాతటైర్లు, మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలని సూచిం చారు.హెల్త్ అసిస్టెంట్ బి.విశ్వేశ్వ రరావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

దత్తిరాజేరు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారినపడకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కె.కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి పి.స్రవంతి సూచించారు.మలేరియా మాసోత్సవాల్లో భాగంగా ఎస్టీ కొత్తవలస, పాపయ్య వలస గ్రామాల్లో శుక్రవారం అవగాహన ర్యాలీలతో పాటు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలకు వైద్యపరీక్షలు చేసి అవసర మైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలతో పాటు డయేరియా ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. వేడి ఆహారాన్ని తీసుకోవాలని, ఇళ్ల ముందు చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని చెప్పారు.హెల్త్ ఎడ్యుకేటర్ గిరిబాబు, సిబ్బంది ప్రవళిక, యమున తదితరులు పాల్గొన్నారు.

డ్రైడే పాటించండి

గజపతినగరం రూరల్: వ్యాధుల వ్యాప్తికి కారణమైన దోమల నివారణ కోసం ప్రజలు ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని, వ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలని మరుపల్లి పీహెచ్‌సీ సిబ్బంది తుమ్మికాపల్లి గ్రామస్తులకు సూచించారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా తుమ్మికాపల్లిలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. నివాస పరిసరాల్లో చెత్త, మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఇళ్లలో పూలకుండీలు, రుబ్బురోళ్లు, ఫ్రిజ్‌లు, వంటి వాటిలో నీరు నిల్వ ఉంటే దోమలకు నిలయంగా మారి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వివరించారు. అనంతరం గ్రామంలోని పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



వేపాడ: నీలకంఠరాజపురంలో వంటకాలను రుచిచూస్తున్న ఎంఈఓ జగదీశ్వరరావు



వేపాడ: సోంపురం పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు



గజపతినగరం రూరల్: గజపతినగరం పాఠశాలలో వంటకాలను రుచి చూస్తున్న ఎంఈఓ-2 చక్రధర్

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం, సోంపురం ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరును, భోజనాల నాణ్యతను ఎంఈఓ జగదీశ్వరరావు, ఎంఈఓ-2 బాలభాస్కరరావు శుక్రవారం పరిశీలించారు. వంటకాలను రుచిచూసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల హాజరు, లెసెన్ ప్లాన్‌ను పరిశీలించారు. విద్యార్థులతో పాటాలు చదివించి, వారి విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు.

మెనూ పాటించకుంటే చర్యలు

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని బజారు సెంటర్ వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను ఎంఈఓ-2 చక్రధర్ శుక్రవారం పరిశీలించారు. వంట కాలను రుచి చూశారు.రోజూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందించాలని, మెనూ పాటించకున్నా, నాణ్యమైన భోజనాలు అందించకున్నా నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మరుగుదొడ్లను పరిశీలించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏడీఏ మహరాజన్

దత్తిరాజేరు: ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు కాకుండా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని గజపతినగరం ఏడీఏ మహ రాజన్ అన్నారు. మండలంలోని పెదమానాపురం సంతతోట వద్ద ఉన్న ఎరువుల దుకాణాల్లో ఏఓ అనురాధతో కలిసి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు.రికార్డులను పరిశీలించిన అనంత రం వరి విత్తనాల బస్తాలను తూకం వేయించారు. ఎరువులు, పురుగులు మందుల నిలవలను,గడువు తేదీని పరిశీలించారు. నాసిరకం విత్తనాలు, ఎరువులు విక్రయించి రైతులను మోసం చేసినట్లు ఫిర్యాదులు వస్తే దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

పాఠ్యపుస్తకాలు ఇప్పించండి

గజపతినగరం రూరల్: నియోజకవర్గ కేంద్రం గజపతినగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని డీటీ టి.సత్యనారాయణను ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు కోరారు తెలిపారు.తహసీల్దార్ కార్యాలయంలో డీటీని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాము, ఈశ్వరరావు,కళాశాల విద్యార్థులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కళాశాలలో సమస్యలను డీటీకి వివరించారు. లోటెట్టేజీ సమస్య వల్ల కళాశాలలోని ఆర్వో ప్లాంట్ సరిగా పనిచేయడం లేదని, అలాగే మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా చేపట్టడం లేదని, స్వీపర్లు రాకపోవడంతో విద్యార్థులే తరగతి గదులను శుభ్రం చేసుకోవాల్సి వస్తోందని చెప్పారు. ప్రభుత్వ వసతి గృహంలో సీట్లను ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు కేటాయిస్తున్నారని, కళాశాలలో సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరారు.

జూలై 1వ తేదీ నుంచి గ్రామసభలు

శృంగవరపుకోట: మండలంలో జూలై 1వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ వెంకటలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1వ తేదీన ధర్మవరం, ధారపర్తి, సంతగవిరమ్మపేట, 3న ఆలుగుబిల్లి, కిల్తంపాలెం, వీరనారాయణం, సీతారాంపురం, పోతనాపల్లి, వసి, 4న చామలాపల్లి, కొట్టాం, మూలబొడ్డవర, ఎస్.కోట తలారి, శివరామరాజుపేట, వేములాపల్లి, వెంకటరమణపేట, పెదఖండేపల్లి, వినాయకపల్లి, 5న రేవళ్లపాలెం , కొత్తూరు, కృష్ణాపురం, ముషిడిపల్లి, మామిడిపల్లి, 6న ఎస్.కోట గ్రామాల్లో సచివాలయాల వద్ద గ్రామసభలు నిర్వహస్తామని పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో నూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ సభలు నిర్వహిస్తామని, సంతగవిరమ్మపేటలో మాత్రం మధ్యాహ్నం 2గంటలకు సభ నిర్వహిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ, జోగినాయుడు

శృంగవరపుకోట: రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బంకురు జోగినాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.వెంకునాయుడు డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌జీఓ హోమ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణం జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5తరగతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్టేట్ సిలబస్‌ను అమలు చేసి, తెలుగు మాధ్యమంలో విద్యాబోధన అమలు చేయాలన్నారు. ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లను, నైట్‌వాచర్‌లను నియమించాలని, మోడల్‌స్కూళ్లలో కారుణ్య నియామకాలు అమలు చేయాలని కోరారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి



వరి నారుపోస్తున్న రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): వ్యవసాయంలో రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలని, పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు రైతులకు సూచించారు. గరివిడి మండలంలోని కోడూరు గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి, మొక్కజొన్న పంటను, వరి నారుమడులను పరిశీ లించారు. మొక్కజొన్నలో కలుపు నివారణ,ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పద్ధతులను రైతులు అలవాటు చేసుకోవాలని చెప్పారు. యంత్రాల వినియోగంతో కూలీల సమస్య, ఖర్చు తగ్గుతుందని వివరించారు. వరి నారు పోస్తున్న రైతులకు పలు సూచనలు చేశారు. ఎకరా విస్తీర్ణంలో వరి నాట్లు వేసేందుకు 5 లేదా 6 సెంట్లలో వరినారు పోసుకుంటే సరిపోతుందని చెప్పారు. ఆయన వెంట ఏఓ వి.శైలజ, వీఏఏ ఎస్.కె.పర్వేజ్ ఆలం ఉన్నారు.

ఉత్తరాంధ్రకు పోలవరం ఓ వరం

- మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాబూరావు

చీపురుపల్లి: పోలవరం ప్రాజెక్టు ఉత్తరాంధ్రకు ఓ వరం లాంటిదని,ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తిచేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు కోరారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు ప్రణాళిక ప్రకారం నిర్దేశిత ఎత్తులో పూర్తి చేస్తే ఉత్తరాంధ్రలోని జిల్లాల్లో 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. పంటల సాగు కోసం రైతులు వర్షాల కోసం ఎదురు చూడాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు. పోలవరం పూర్తయితే ఉత్తరాంధ్ర జిల్లాల్లో సన్న, చిన్నకారు రైతులు వలసలు వెళ్లే పని కూడా ఉండదన్నారు. అలాగే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా ఉత్తరాంధ్ర ప్రజలకు తాగునీరు కూడా సంపూర్ణంగా లభిస్తుందన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు క్రింద కేంద్ర ప్రభుత్వం పనులు చేస్తుందా లేదా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత తీసుకుని పనులు నిర్వహిస్తుందా అనేది చూసుకుని, త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇది ఇలా ఉండగా జిల్లాల్లో నామినేటెడ్ పదవులను తక్షణమే నియామకం చేయాలని కోరారు. ప్రధానంగా డీసీసీబీ, డీసీఎంఎస్ వంటి పదవులకు ఎన్నికల ద్వారా లేదంటే నామినేటెడ్ విధానంలో భర్తీ చేయాలన్నారు. ఆర్‌ఈసీఎస్‌లో నిబంధనలకు వ్యతిరేకంగా జరిగిన నియామకాలను రద్దు చేసి పూర్తి పారదర్శకతతో నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

సంతల్లో ఆశీల వసూళ్లకు వేలం పాట



వేపాడ: బొద్దాంలో వేలంపాట నిర్వహిస్తున్న ఈఓపీఆర్డీ ఉమ, తదితరులు



గజపతినగరం రూరల్: గజపతినగరంలో వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

వేపాడ: మండలంలోని బొద్దాం,వల్లంపూడి గ్రామ పంచాయతీల్లోని సంతల్లో ఆశీల వసూళ్లకు ఈఓపీఆర్డీ ఉమ ఆధ్వర్యంలో శుక్రవారం వేలం పాట నిర్వహించారు.బొద్దాంలో డైలీ, వారపుసంతలో ఆశీల వసూలుకు రామేల దేముడు అనే వ్యక్తి రూ.1,46,500లకు వేలం పాడుకున్నారు. అలాగే వల్లంపూడిలో రోజు వారీ మార్కెట్‌లో ఆశీల వసూలుకు పార్దాన స్వామినాయుడు రూ. 50వేలకు పాడుకున్నారు. ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు పద్మ,వెంకటరమణ సర్పంచ్‌లు ఎర్రా రామసత్యవతి, రుద్ర అంజిలీదేవీ పాల్గొన్నారు.

3వ తేదీకి వాయిదా

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలో రోజు వారీ మార్కెట్‌లో ఆశీల వసూళ్లకు శుక్రవారం వేలం పాట నిర్వహించగా, పంచాయతీ నిర్ణ యించిన ధరకు వేలం జరగకపోవడంతో జూలై3వ తేదీకి వేలం పాట వాయిదా పడింది. పంచాయతీ కార్యదర్శి రమణ మాట్లాడుతూ ఆశీల వసూళ్లకు పంచాయతీ నిర్ణయించిన ధర రూ.3,08,660 కాగా రూ.63 వేలుకే వేలం పాట జరగడంతో వాయిదా వేశామన్నారు. మూడుసార్లు వేలం పాట నిర్వహిస్తామని, అప్పటికీ పంచాయతీ నిర్ణయించిన ధర కంటే తక్కువగా వేలం జరిగితే నేరుగా పంచాయతీ సిబ్బందే మార్కెట్‌లో ఆశీలు వసూలు చేస్తారని చెప్పారు. ఈఓపీఆర్డీ జనార్దన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జానపద కళలను కాపాడుకుందాం



చెక్క భజన శిక్షణలో మాట్లాడుతున్న కూర్మారావు

గంట్యాడ: మన సంస్కృతిలో భాగమైన జానపద కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గిడుగు రామ్మూర్తి తెలుగుభాష, జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు, నవచైతన్య నాట్య కళామండలి అధ్యక్షుడు ఎస్.చినరెడ్డి అన్నారు. మండలంలోని పెదవేమలి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన చెక్క భజన, కోలాటం శిక్షణలో వారు మాట్లాడుతూ గతంలో జానపద కళలైన చెక్కభజన, కోలాటం, తప్పెట గుళ్లు, జముకుల పాటలకు మంచి ఆదరణ ఉండేదని అన్నారు. మళ్లీ జానపద కళలకు అలాంటి ఆదరణ వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జానపదకళలను మరిచిపోకుండా భావితరాల వారికి అందించాలన్నారు. అట్టాడ లక్ష్మునాయుడు, పాశల సురేష్, సిరపు రామునాయుడు, సిరపు సన్యాసయ్య, పాటుపురెడ్డి మహేష్, శిరికి రమణ, రెడ్డి రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల గొడౌన్ పరిశీలన

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని ఈవీఎంల గోదామును కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శుక్రవారం తనిఖీ చేశారు. సీసీ కెమెరాలు, గొడౌన్లకు వేసిన తాళాలు, సీళ్లను పరిశీలించారు. అలాగే అక్కడి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. గోదాములకు ఇరువైపులా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఇంజినీరింగ్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇరువైపులా చెరువుల్లో మారిన పల్లపు ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించారు. నీరు బయటకు పోయేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, ఆర్‌డీఓ ఎంవీ సూర్యకళ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బి. ఉమాశంకర్, ఇరిగేషన్ ఈఈ ఎం. సీతారామునాయుడు, మున్సిపల్ కమిషనర్ బాలాజీప్రసాద్, ఎలక్షన్ సూపరింటెండెంట్ ప్రభాకర్, తహసీల్దార్ ధర్మరాజు, డీటీ మూర్తి, రాజకీయ పార్టీల నాయకులు సముద్రపు రామారావు, రేగాన శ్రీనివాసరావు, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

- పొంచి ఉన్న వ్యాధుల కాలం
- జాగ్రత్తలు పాటించకుంటే అంతే..
- బలవర్ధకమైన ఆహారంతో పాటు పరిశుభ్రత ముఖ్యం



పోషక విలువలతో కూడిన కూరగాయలు, పండ్లు

పూసపాటిరేగ : వర్షాకాలం ప్రారంభమైంది. ఈ సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సరైన జాగ్రత్తలు పాటించకపోతే రోగాల బారిన పడక తప్పదు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రోగ నిరోధకశక్తి పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, సరైన ఆహార అలవాట్లు లేకపోవడం, వ్యాయామానికి దూరంగా ఉండడం వల్లే ఎక్కువ మంది వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పరిసరాల పరిశుభ్రతతో పాటు పౌష్టికాహారం ఆవశ్యతను ప్రజలకు వైద్యాధికారులు వివరిస్తున్నారు. వీలైనంతవరకు నిల్వ చేసిన ఆహారం, తీపి పదార్థాలకు దూరంగా ఉండాలి. రడీమేడ్ ఆహారం, ఫ్రిజ్‌లలో నిల్వ ఉన్న కూల్‌డ్రింక్‌లు, ఆహార పదార్థాలు తీసుకోకపోవడం ఉత్తమం.

రోజు వారి ఆహారం ఇలా ..

ఉదయం 2 ఇడ్లీలు లేదా 60 గ్రాములు గింజ ధాన్యాలు, 25 గ్రాముల పప్పు ధాన్యాలు, 150 మిల్లీ లీటర్ల పాలు తీసుకోవచ్చు. 11 గంటల సమయంలో ఏదో ఒక పండు, నిమ్మరసం లేదా జామకాయను తీసుకోవాలి. ఇవేవీ అందుబాటులో లేకపోతే గ్లాసు పాలైనా తాగాలి. మధ్యాహ్న భోజనంలో 75 గ్రాములు గింజ ధాన్యాలతో చిరుతిండి. కప్పు పాలు తాగాలి. రాత్రి భోజనంలో రెండు కప్పుల అన్నం లేదా చపాతి లేదా పుల్కా కూరగాయలతో కూడిన కూరను తీసుకోవాలి. ప్రతిరోజూ 150 మిల్లీలీటర్ల పాలు తీసుకోవాలి. టీ , కాఫీ అవసర్లున్న వారు రోజుకు ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే తాగాలి.

పప్పుధాన్యాలు

ఆహారంలో పప్పులు, మినుములు, శనగలు, బాదంపప్పు వంటివి ఎదో ఒకటి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతిరోజూ ఎదో ఒక ఆకుకూర 100 గ్రాములు ఉండేలా చూసుకోవాలి. జామి, ఉసిరి, నిమ్మ ఎదో ఒకటి తప్పనసరిగా తీసుకోవాలి. రోజూ ఉడికించిన గుడ్డు, వారంలో ఒకసారి చికెన్ లేదా మటన్ తీసుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

జలుబు, దగ్గు, ఆయాసం వంటి సమస్యల నుంచి ఉపశమనం కోసం, మిరియాలు, అల్లం , వెల్లుల్లి బాగా ఉపయోగపడతాయి. వీటిని అవసరం మేరకు వేడి పాలు, వేడినీరు, టీలో కలుపుకొని తాగితే ఉపశమనం కలుగుతోంది.

ఆహారపు అలవాట్లు

ప్రతి పూట భోజనానికి ముందు తర్వాత సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. పరిశుభ్రమైన ఆహారం తీసుకున్నట్లయితే వ్యాధులు దరిచేరవు. ఆహారాన్ని ఒకేసారి కాకుండా కొంచెం, కొంచెం ప్రతి మూడు గంటలుకు ఒకసారి తీసుకోవడం ఉత్తమం. రోజు తినే ఆహారంలో తాజా ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. పసుపు, నారింజ రంగులో ఉండే పండ్లు దీర్ఘకాలిక వ్యాధులును నయం చేస్తాయి. తాజాగా ఉండే పచ్చి కూరగాయలు, పండ్లను జ్యూస్ రూపంలో తీసుకోవచ్చును.

మంచి ఆహారంతోనే ఆరోగ్యం



ఆహారంలో పల్లీలు, మినుములు, శనగలు, బాదం, పప్పుధాన్యాలు వంటివి ఏదో ఒకటి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఏదైనా బాగా ఉడికించిన ఆహారం తీసుకోవాలి. విటమిన్లు ఉన్న ఆహారం తీసుకున్నట్లయితే ఆరోగ్యవంతంగా ఉంటాం.

– ప్రమీలాదేవి, డాక్టర్, పూసపాటిరేగ పీహెచ్‌సీ